www.jananinadam.com

Follow :

జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం



ఆదివారం 17-10-2026

సంపుటి : 2 సంచిక : 161

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from ,Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం: పొన్నం ప్రభాకర్



రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని మంత్రి పొన్నం హామీ

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తామని వెల్లడి

సీసీఎస్ బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి

తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు.వారి పెండింగ్ బకాయిలను వీలైనంత త్వరగా చెల్లిం చేందుకు ప్రభుత్వం చర్యలు ని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ

ఎల్ నినో ఎఫెక్ట్...

కరెంట్, నీళ్లు పాదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన

విద్యుత్, నీటిని పాదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

గతంలో చలిగా ఉండే అక్టోబర్లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత

వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి



ష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా స్త మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉ ష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే



పోలీస్ యూనిఫామ్లో డ్యాన్స్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

: డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్

ప్రైవేట్ వినోద కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు

సోషల్ మీడియాలో పోలీసుల డ్యాన్స్ వీడియోలు వైరల్ కావడంతో ఈ నిర్ణయం

యూనిఫామ్ గౌరవాన్ని కాపాడాలని సెబ్బందికి సీవీ ఆనంద్ సూచన

తెలంగాణలో పోలీస్ సిబ్బంది యూనిఫామ్లో డ్యాన్సులు చేయడంపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇకపై యూనిఫామ్ ధరించి వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నా, డ్యాన్సులు చేసినా కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన శు

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర...

చంద్రబాబు ప్లాన్కు రేవంత్ సహకారం

తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ

దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ

గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ

గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్రావు అభ్యంతరం

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణాలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్రావు ఆరోపించారు. గోదావరి- కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బ-కచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్రావు పేర్కొన్నారు. రేవంత్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

జిన్నారం కాలనీలో ఎంపి ఈటల పర్యటన

చీర్యాల పరిధిలోని జిన్నారం కాలనీలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.డివిజన్ లో ఉన్న త్రాగు నీటి సమస్య, వీధి దీపాలు, రేషన్ బియ్యం వంటి తదితర సమస్యలపై తొందరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోల బలరాజ్ యాదవ్ , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్ రెడ్డి , చేర్యాల మాజీ సర్పంచ్ కోల అశోక్ యాదవ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు ఏలూరు సత్యనారాయణ , మాజీ వార్డు సభ్యులు శ్రీడొంకెనీ శాలిని రమేష్ గౌడ్ , బర్లపాటి ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షులు కోల మల్లేష్ యాదవ్ , సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి , జిన్నారం కాలనీ అధ్యక్షులు సంపత్ , జిన్నారం వేణు, కిరణ్ , మహేష్ కాలనీలోని మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలి

: మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ 17: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లను, చెరువు సుందరీకరణ పనులను, చెరువు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ పనులను ఆయన పరిశీలించారు.బతుకమ్మ ఘాట్ మెట్ల వద్ద మాత్రమే కాకుండా, చెరువు వైపు ఇతర ప్రాంతాల్లో కూడా అవసరమైన చోట్ల బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరేపల్లి చెరువు వద్ద కూడా బతుకమ్మ వేడుకల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ

అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగు వద్దని రైతులకు హితవు

దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోవద్దు

నీటి వనరులు వృధా కాకుండా గట్టి నిఘా కొనసాగించాలి

కలెక్టర్



నిజామాబాద్, అక్టోబర్ 17: ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు.

ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు



వరంగల్17: ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా తేదీ 20-10-2026 మధ్యాహ్నం 03:00 గంటల నుండి తేదీ 21-10-2026 ఉదయం 03:00 గంటల వరకు ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి.ట్రాఫిక్ మళ్లింపులు ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఫున్నెలు క్రాస్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లవలెను. -- కరీంనగర్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయాసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను. -- హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, ఫున్నెలు క్రాస్ మీదుగా వెళ్లాలి.ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు సందర్శకుల సౌకర్యార్థం క్రింది ప్రదేశాలలో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు

ఎల్ నినో ఎఫెక్ట్...

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. “ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది” అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం : పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి...

భూములను విక్రయిం చేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సుమారు 17,000 మంది రిటైర్డ్ ఉద్యోగులకు రూ.980 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు గతంలో సంఘాలు వెల్లడించిన నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి...

చేసారు. – హన్మకొండ హంటర్ రోడ్ నుండి వచ్చే వాహనాలు: కొలంబో హాస్పిటల్, బీఆర్ నగర్ ఎదురుగా గల గానుగ ఆయిల్ పాయింట్ వద్ద, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్ మరియు జేఎస్ఎం స్కూల్ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. – కడిపికొండ నుండి వచ్చే వాహనాలు: భారత్ పెట్రోల్ పంపు వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.– ఆర్టీఓ జంక్షన్ నుండి వచ్చే వాహనాలు: లవ్లీ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో, తాళ్ల పద్మావతి కాలేజీ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. – కరీమాబాద్ నుండి వచ్చే వాహనాలు: భీరన్న గుడి వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. ప్రజలు, సందర్శకులు ట్రాఫిక్ మళ్లింపులను పాటిస్తూ, తమ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలిపి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేసారు.

పోలీస్ యూనిఫామ్లో డ్యాన్స్ చేస్తే కఠిన చర్యలు తప్పవు : డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి...

క్రవారం హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్ల అధిపతులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో పలువురు పోలీసు సిబ్బంది, అధికారులు పండుగలు, ప్రైవేట్ కార్యక్రమాల్లో యూనిఫామ్లోనే డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గణేశ్ నిమజ్జనం, మేడారం జాతర, వీడ్కోలు సమావేశాలు వంటి సందర్భాల్లో జరిగిన ఈ ఘటనలు పోలీసు శాఖ క్రమశిక్షణపై ప్రజా విమర్శలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో డీజీపీ తాజా ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ యూనిఫామ్ అనేది బాధ్యత, అధికారం, క్రమశిక్షణకు ప్రతీక అని, దాని గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీపీ నొక్కిచెప్పారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ

మొదటిపేజీ తరువాయి...



సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా, రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు వద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ మున్సిపల్ ఎన్నికల పై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రెస్ మీట్



ఆళ్లగడ్డ 17: ఆళ్లగడ్డ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల రెండో రోజు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, కూటమి నాయకులు ఎంతో ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారని ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో, ఆళ్లగడ్డ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో మేమంతా ఎన్నికల బరిలోకి దిగుతున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.తాము ప్రజలను అభివృద్ధి చేసి చూపించామని చెప్పి ఓట్లు అడుగుతున్నామని ఆళ్లగడ్డ పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని చెరువులను నింపడం నుంచి, రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని, ఈ అభివృద్ధిని ప్రజలు తమ కళ్ల ముందే చూస్తున్నారని అఖిలప్రియ తెలిపారు.వైఎస్సార్సీపీ నాయకులకు కూడా నేను ఒక విషయం చెప్పదలుచుకున్నామని, వారు కూడా ఎన్నికల్లో పోటీ చేయాలి, ప్రజల మధ్యకు రావాలి, వారి అభిప్రాయాలను ప్రజలకు తెలియజేయాలని ప్రజాస్వామ్యంలో పోటీ ఉండాలని ,ఆళ్లగడ్డలో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ఎన్నికల సంఘం, అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పార్టీలు ఎన్నికల నియమాలను గౌరవిస్తూ సహకరించాలని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగుతున్నామని కార్యకర్తలందరం కలిసి ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం పనిచేస్తామని,గతంలో కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తున్నామని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఆళ్లగడ్డలో కూడా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మా అభ్యర్థులు ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే పూర్తి నమ్మకం మాకు ఉందని ప్రజలు అభివృద్ధిని గమనించి, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. ఆళ్లగడ్డను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలియజేయడం జరిగింది.

యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి

బి జె వై ఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండె డిమాండ్ గన్ పార్క్ వద్ద బీజేవైఎం భారీ నిరసన



హైద్రాబాద్ అక్టోబర్ 17: యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గన్ పార్క్ వద్ద బీజేవైఎం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కాశర్యక్రమానికి పెద్ద ఎత్తున బీజేవైఎం నేతలు,కార్యకర్తలు హాజరైన్నారు.ఈ సందర్భంగా గణేష్ కుండెమాట్లాడుతూరాహుల్ గాంధీ పప్పు గాంధీ ఆయన హైద్రాబాద్ వస్తె యువత చెప్పుల దండ వేస్తారన్నారు.రాహుల్ గాంధీ దిల్లీలో ధర్నాలు కాదు ఇక్కడికి వచ్చి మాట్లాడు..తెలంగాణ లో ఉన్న మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించు...ద్వంద వైఖరి చేయకండి ..ఎంఎల్సీ ఎన్నికలకు వెళ్లే ముందు మీ హామీలు గురించి చెప్పండి..మీరు ఇచ్చిన హామీలు అమలు అయ్యేదాకా..ఃఏజఓ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.4000 వేల నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి .జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి .గణేష్ కుండె డిమాండ్ చేశారు.లేకపోతే యువత మిమ్మల్ని తరిమి కొడుతుందని హెచ్చరించారు.హామీలు అమలు చేయకుండా ఎమ్మెల్సీ ఓట్లు ఎలా అడుగుతారని గణేష్ కుండె ప్రశ్నించారు.

బతుకమ్మ సంబరాలకు హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



సికింద్రాబాద్17: ఏ పండుగ అయినా పూజ చేసినా పూలతో అలంకరిస్తాం, పూలతో పూజిస్తాం అటువంటి పూలనే పూజించే ప్రకృతితో ముడిపడి ఉన్న అద్భుతమైన పండుగ బతుకమ్మ పండుగ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.విజయదశమి నవరాత్రి వేడుకలు, బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని సికింద్రాబాద్, సీతాఫల్ మండిలో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన బతుకమ్మ సంబరాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ముఖ్యఅతిథులుగా హాజరై దుర్గ మాతకు పూజలు నిర్వహించి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. పెద్దఎత్తున హాజరైన మహిళలతో కలిసి కిషన్ రెడ్డి సతీమణి కావ్యాకిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నేతలు విజయ లక్ష్మి, బండ కార్తీక రెడ్డి తదితరులు బతుకమ్మ ఆటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పల్లెల నుండి పట్నాల వరకు ప్రతి వాడలో కులాల తేడా లేకుండా, చిన్నా పెద్దా, ధనిక పేద అని తేడా లేకుండా మహిళల హక్కుల కోసం కూడా జరుపుకునే విశిష్టమైన పండుగ అని తెలిపారు. రాష్ట్ర బీజేపీ చీఫ్ మాట్లాడుతూ తెలంగాణ పండుగ ఇప్పుడు విశ్వవ్యాప్తమయ్యిందని తెలిపారు. దేవి మాత దీవేనలతో తెలంగాణ రాష్ట్రం సష్యశామలంగా ఉండాలని వేడుకున్నారు.

మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30



మార్కాపురం, 17: మార్కాపురం మరియు గిద్దలూరు మున్సిపాలిటీ ఎన్నికలు, ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు మరియు దసరా పండుగ వేడుకల నేపథ్యంలో ప్రజా శాంతి, భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం మార్కాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎన్. సత్యనారాయణ పోలీస్ యాక్ట్, 1861లోని సెక్షన్ 30 ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల ప్రకారం మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సంఘాలు, సంస్థలు లేదా ఇతర వ్యక్తులు ఊరేగింపులు, ర్యాలీలు, బహిరంగ సభలు మరియు ఇతర ప్రజా కార్యక్రమాలు నిర్వహించాలంటే సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేదా లైసెన్స్ పొందాలి. ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 24 గంటల ముందుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తులో కార్యక్రమం నిర్వహించే ఉద్దేశం, ఊరేగింపు మార్గం, తేదీ, సమయం, సమావేశం ప్రారంభమయ్యే మరియు ముగిసే ప్రదేశాలు, పాల్గొనే వారి అంచనా సంఖ్య వంటి వివరాలను స్పష్టంగా పేర్కొనాలి.కార్యక్రమ నిర్వాహకులు సంబంధిత అధికారులు విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రజా శాంతికి భంగం కలగకుండా, ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడకుండా, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.అదేవిధంగా, కార్యక్రమాల్లో పాల్గొనే వారందరూ క్రమశిక్షణ పాటించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. రెచ్చగొట్టే ప్రసంగాలు, ఉద్రిక్తతలకు దారితీసే నినాదాలు, మత సామరస్యానికి మరియు ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడకూడదు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు మరియు సంబంధిత అధికారుల చట్టబద్ధమైన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి.మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఈ ఉత్తర్వులను కఠినంగా అమలు చేస్తూ, తమ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన జేఎండీ కోన శివశివప్రసాద్



ఆళ్లగడ్డ 17: ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోను, బస్టాండును శనివారం ఏపీఎస్ఆర్టీసీ జే ఎం డి కోన శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన డిపో అధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. డ్రైవర్లు బస్సులను బాగా నడిపి మంచి కేఎంపిఎల్ తీసుకొని రావాలన్నారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం పాటుపడే కార్మికులకు సంస్థ చేయూత అందిస్తుందని అన్నారు. సిబ్బందికి రావలసిన ఇంక్రిమెంట్లు సకాలంలో అందించేందుకు డిపో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బస్టాండును కూడా ఆయన తనిఖీ చేసి బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బస్ స్టేషన్ లో బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎండి శివప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా, డిపో మేనేజర్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 17: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతుందని, ఓటర్ల నుండి సేకరించిన ధ్రువపత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాయకల్ప అవార్డ్ 2025--26లో
మంచిర్యాల జిల్లాకు ఘన విజయం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 17: కాయకల్ప అవార్డ్ 2025--26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయాన్ని సాధించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నర్సూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో టి.వి.వి.పి. వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాయకల్ప్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి 10 లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకోగా, చెన్నూరు ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు కమెండేషన్ అవార్డులతో పాటు ఒక్కొక్కటి 1 లక్ష రూపాయల నగదు బహుమతిని సాధించాయని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాల మెరుగుదలకు వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ విజయంలో 3 ఆసుపత్రుల పర్యవేక్షకులతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కృషి అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ 3 ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కింద ఆరుగురికి ఉద్యోగాలు
నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ హరిత



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17: కారుణ్య నియామకాల కింద జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆరుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాల కింద వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఇందులో ముగ్గురికి జూనియర్ అసిస్టెంట్లుగా, మరో ముగ్గురికి కార్యాలయ సబార్డినేట్లుగా నియామకాలు చేపట్టినట్లు వివరించారు.కార్యక్రమంలో శిక్షణ ఉప పాలనాధికారి జాస్తిన్ జోయల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, కారుణ్య నియామక అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆయుష్ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

జిల్లా ఆయుష్ నోడల్ అధికారి

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 17: ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ (ఫీమేల్) పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా-డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు.. పీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ

డి ఎం హెచ్ ఓ డా. నాగేంద్ర



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 17: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కెరమెరిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. నాగేంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించాలి

పీహెచ్‌సీలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, వైద్య పరీక్షల గదుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఓపీ, ఐపీ, ప్రయోగశాల, ఫార్మసీ తదితర విభాగాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రసవానంతర సంరక్షణ సేవలను సమర్థంగా అందించాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీకాల నిల్వ, కోల్డ్‌చైన్ పరికరాల నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.పీహెచ్‌సీలో అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అత్యవసర వైద్య సేవలతోపాటు అన్ని ఆరోగ్య సేవలు నిరంతరాయంగా అందించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

బాలల నుంచే భావి నాయకుల నిర్మాణం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొట్నాక గణపతి
జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ కు సన్మానం



జననినాదం,తిర్యాణి 17: బాలల నుంచే భావి నాయకుల నిర్మాణానికి జవహర్ బాల్ మంచ్ కృషి చేయాలని తిర్యాణి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొట్నాక గణపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జవహర్ బాల్ మంచ్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్‌గా నియమితులైన నైతం రాంచందర్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని అలవర్చడంలో జవహర్ బాల్ మంచ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ బాలల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేయాలన్నారు. విద్య, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా బాలలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపాలని ఆకాంక్షించారు. నైతం రాంచందర్ నియామకం జిల్లాకు గర్వకారణమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బొల్లం వెంకన్న, జిల్లా ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు పులి కొమురయ్య, స్పోక్ పర్సన్ కూన సురేష్, మండల ఉపాధ్యక్షుడు చుంచు బాబురావు, వల్కా రామచందర్, ప్రధాన కార్యదర్శులు దుర్గం పవన్, గౌర్య కుమార్, సీనియర్ నాయకులు అంకం గౌరయ్య, సర్పంచ్లు నైతం మంగు, తుంరం మాన్కు, మల్యాల అశోక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, జుగునక మారుతి, ఎస్టి సెల్, సేవాదళ్ అధ్యక్షుడు శంకర్, కిషన్ సెల్ దుస మధుకర్, కార్యదర్శులు కోవ శంకర్, పూసం రాజు, ముంజం సతీష్, సీనియర్ నాయకులు బుద్దె శంకర్, బుద్దె బానయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు బుద్ధ రమేష్, సిడం జలపతిరావు ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వెడ్మ శంకర్, పెందోర్ దయాకర్, సీనియర్ నాయకులు, చాకటి జగన్, రొంపల్లి అధ్యక్షుడు పేందర్ రాజు, ఉపాధ్యక్షుడు కొర్వెత్తు తుకారం, ఫోక్ పర్సన్ యశ్వంతరావు, ఎస్టీ సెల్ నాయకుడు బల్లర్ష, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 17: ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షేట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సంఖ్య, వ్యాధుల వివరాలు, మందుల లభ్యత, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించి ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తున్న రోగులు, నమోదు అవుతున్న వ్యాధులు, చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలతో పాటు డెంగ్యూ లక్షణాలతో వస్తున్న రోగుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌ను సందర్శించి పరీక్షల నిర్వహణ, రోగుల వివరాల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ అంశాలను పరిశీలించి, ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని, వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. డెంగ్యూ లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు ఏ ప్రాంతాలకు చెందినవారో గుర్తించి, ఆయా ప్రాంతాలలో త్రాగునీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు వ్యాధుల వ్యాప్తికి దారితీసే పరిస్థితులను గుర్తించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో త్రాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో వెంటనే నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు 10వ వార్డుతో పాటు పట్టణంలోని అన్ని వార్డులలోనూ నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, వివరాలను సమగ్రంగా పరిశీలించాలని వైద్యులకు సూచించారు. మున్సిపల్ అధికారులు అన్ని వార్డులలో త్రాగునీటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల వృద్ధికి అనుకూలమైన పరిస్థితులను నివారిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఘనంగా సద్దుల బతుకమ్మ

ఆటపాటలతో సందడి చేసిన వైద్య సిబ్బంది





జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 17: మంచిర్యాల జిల్లాలోని ఆరోగ్య ఆసుపత్రి ఆవరణలో సద్దుల బతుకమ్మ వేడుకలను సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో ఆయమ్మల నుంచి స్టాఫ్ నర్సుల వరకు అందరూ కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం అందించిన సహకారంతోనే వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించుకోగలిగామని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు మోర వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ భరత్, డాక్టర్ రాజేష్ కుమార్ ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి త్వరగా కోలుకోవాలని, బతుకమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకొన్నారు.

కుమురం భీం వర్ధంతి ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు

అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ డీడీ జాదవ్ అంబాజీ ఆదేశం



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 17: ఆదివాసీ వీరుడు కుమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ఆదేశించారు. ఈ నెల 26న జోడేఘాట్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు, ప్రజలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

భద్రతకు ప్రాధాన్యమివ్వాలి.

వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని అంబాజీ సూచించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జనసందోహాన్ని నియంత్రించడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కుమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రాజు, ఏటీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 22న చలో రౌటసంకేపల్లి

కుమురం భీము, ఎడ్ల కొండు జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



రౌటసంకేపల్లి, అక్టోబర్ 17: గిరిజన పోరాట యోధులు కుమురం భీము, ఎడ్ల కొండు జన్మస్థలమైన రౌటసంకేపల్లిలో ఈ నెల 22న నిర్వహించనున్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రాజ్ గోండ్ సేవా సమితి, పంచాయతీ రాయి సెంటర్ ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఎస్పీ నీతిక పంత్, అడిషనల్ ఎస్పీ చిత్తరం దాస్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గిరిజన పోరాట యోధుల జన్మభూమి రౌటసంకేపల్లిలో నిర్వహించే జయంతి ఉత్సవాలకు గిరిజనులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కుమురం భీము కుటుంబ సభ్యులు కుమురం సీతారాం, రాము, వెంకటేష్, ఎడ్ల కొండు వారసులు ఎడ్ల బక్కయ్య, కొలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు, ఆర్జేఎస్ ప్రధాన కార్యదర్శి మడావి గుణవంతురావు, కార్యనిర్వహణ వైస్ చైర్మన్ వై. రాజేష్, పాండు, ఆత్రం షేక్ తదితరులు పాల్గొన్నారు.

పూలనే దేవతగా పూజించే వేడుక బతుకమ్మ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక: జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17: ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను అందంగా పేర్చి బతుకమ్మగా కొలుస్తూ దేవతగా పూజించడం తెలంగాణ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కె. హరిత, న్యాయమూర్తులు అనంతలక్ష్మి, అనూష, ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణితో కలిసి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మను పేర్చి పూజించే సంప్రదాయం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. ప్రకృతితో మమేకమై జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మన వారసత్వ సంపదను కాపాడుకుంటూ, సంప్రదాయాలను భావితరాలు ఆచరించేలా ప్రోత్సహించాలని సూచించారు.వేడుకల్లో భాగంగా నిర్వహించిన రంగోలి, ఇతర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమురం భీం వర్ధంతికి మంత్రులకు ఆహ్వానం...

గోడప్రతుల ఆవిష్కరణ



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17:గిరిజన పోరాట యోధుడు కుమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వర్ధంతికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు.జోడేఘాట్‌లో వర్ధంతి వేడుకలుకుమురం భీం 86వ వర్ధంతిని ఈ నెల 26న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్ గ్రామంలో నిర్వహించనున్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన కుమురం భీం త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేలా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు హాజరై కుమురం భీంకు నివాళులర్పించాలని కోరారు.మంత్రులను కలిసిన వారిలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురం భీం మనుమడు సోనేరావు, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, సిర్పూర్(యు) గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు. నాగోరావు,ఆదివాసీ సంఘాల నాయకులు మూట ఎల్లయ్య, రాంచందర్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్

మల్టీపర్పస్ కార్మికులకు దసరా కానుకలు



జననినాదం,తిర్యాణి 17: గ్రామాభివృద్ధిలో మల్టీపర్పస్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మందడగు సర్పంచ్ తుంరం గోపాల్ అన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు పంచాయతీ పరిధిలో చేపట్టే వివిధ కార్యక్రమాలు విజయవంతం కావడంలో కార్మికుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా విధులు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న వారి సేవలను గుర్తిస్తూ దసరా పండుగ సందర్భంగా బట్టలు అందజేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కార్మికుల సహకారం మరువలేనిదని అన్నారు. ఈ సందర్భంగా వారికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి సాయిరాం గౌడ్ పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న అక్కాచెల్లెళ్లకు అండగా ఉంటాం

పేదలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి

బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



జననినాదం,ఆదిలాబాద్ 17: తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్కాచెల్లెళ్లకు అండగా నిలుస్తానని బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు భరోసా ఇచ్చారు. నేరడిగొండ మండలం గుప్తాల గ్రామపంచాయతీ పరిధిలోని ఏషా గూడకు చెందిన ఆత్రం నాగమణి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం పరామర్శించి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. చెల్లి ఆరోగ్య పరిస్థితిని చూసి కన్నీటిపర్యంతమైన అక్క జల్దేవిని ఓదార్చారు. ఆత్రం జల్దేవి (18), నాగమణి (15) చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారని బాపూరావు తెలిపారు. రెండేళ్ల క్రితం తండ్రి కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందగా, ఆరు నెలలకే తల్లి కూడా కన్నుమూసిందన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరిలో నాగమణి అనారోగ్యానికి గురై ఐసీయూలో చికిత్స పొందుతుండటం బాధాకరమన్నారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబానికి తనవంతు సాయం అందించినట్లు చెప్పారు. నాగమణికి మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులను కోరారు.



పేదలకు అండగా ఉంటాం...

ఆర్థిక ఇబ్బందులతో ఏ పేద విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని, డబ్బుల్లేక ఏ నిరుపేదా వైద్యం అందక ఇబ్బందులు పడకూడదని బాపూరావు అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీని స్థాపించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. నాగమణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కన్వీనర్ బానోత్ వసంత్‌రావు, సీనియర్ నాయకుడు రఘునాథ్, గుడిహత్నూర్ మండల కన్వీనర్ పిట్ల మహేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలి

ఎంపీడీఓ రవీందర్



జననినాదం,సిర్పూర్(యు) 17: గ్రామాల్లో అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఎంపీడీఓ రవీందర్ సూచించారు. మండలంలోని కోహినూర్ బి గ్రామపంచాయతీ పరిధి సోయంగూడలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా ఫామ్‌పాండ్ (వ్యవసాయ కుంట), కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను చేపట్టి, నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఏపీఓ కృష్ణ, కనక సుధ్మతీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సోయాకు వర్షం శాపం.. పత్తికి వరం..!

చేతికొచ్చిన పంటపై ప్రకృతి దెబ్బ

చిరుజల్లులతో రైతుల్లో భిన్న ఆందోళనలు

జననినాదం ప్రత్యేక కథనం



జననినాదం,సిర్పూర్(యు), జైనూరు అక్టోబర్ 05: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే వేళ వరుణుడు పలకరించడంతో సోయా రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. మరోవైపు నేలలో తేమ లేక దిగుబడి కోసం ఎదురుచూస్తున్న పత్తి రైతులకు అదే వర్షం ఊరటనిచ్చింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యు), జైనూరు తదితర మండలాల్లో శనివారం కురిసిన చిరుజల్లులు అన్నదాతల్లో భిన్న పరిస్థితులను సృష్టించాయి.

చేతికొచ్చిన పంటపై నీటి దెబ్బ..!

సోయా పంట కోతలు, నూర్పిళ్ల దశకు చేరుకున్న తరుణంలో వర్షం కురవడం రైతులను కలవరపెడుతోంది. కొన్ని ప్రాంతాల్లో కోసిన పంట పొలాల్లోనే ఉండటంతో తడిసిపోతుందనే భయం వెంటాడుతోంది. పంట నాణ్యత దెబ్బతింటే మార్కెట్‌లో ధర తగ్గి పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులతో సతమతమవుతున్న అన్నదాతలకు చివరి దశలో వాతావరణం ప్రతికూలంగా మారడం ఆవేదన కలిగిస్తోంది. వర్షం మరింత కొనసాగితే చేతికొచ్చిన దిగుబడికి నష్టం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

పత్తికి ప్రాణం పోసిన చిరుజల్లులు..!

సోయా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వర్షం.. పత్తి రైతుల్లో మాత్రం ఆశలు చిగురింపజేసింది. వర్షాభావ పరిస్థితులతో నేలలో తేమ తగ్గి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు చిరుజల్లులు కొంత ఊరటనిచ్చాయి. పత్తి ఎదుగుదలకు తేమ దోహదపడుతుందని భావిస్తున్నారు. అయితే వర్షం అధికమైతే పంటకు ముప్పు తప్పదనే ఆందోళన కూడా వారిలో ఉంది.

అన్నదాతకు ప్రకృతితో పరీక్ష..!

ఒకే వర్షం.. ఒకరికి ఆందోళన, మరొకరికి ఆనందం! పంట చేతికొచ్చే దశలో వాతావరణం అనుకూలించకపోతే రైతు శ్రమ, పెట్టుబడులు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. మరోవైపు రబీ సాగుకు ఈ వర్షం కొంత ప్రయోజనం కలిగించే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు. మొత్తంగా చిరుజల్లులు సోయా రైతుల్లో గుబులు రేపగా.. పత్తి రైతుల్లో కొత్త ఆశలు నింపాయి.

కొలం సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హనుమాండ్ల జగదీష్

కొలం సంఘం మండల అధ్యక్షుడు కి సన్మానం



జననినాదం,తిర్యాణి 17: కొలం సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన అధ్యక్షుడు బోజ్జిరావు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హనుమాండ్ల జగదీష్ అన్నారు. కొలం సంఘం మండల అధ్యక్షుడిగా నియమితులైన బోజ్జిరావును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కొలం సామాజిక వర్గం అభివృద్ధికి, సంక్షేమానికి సంఘం నాయకులు కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు బోజ్జిరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కొలం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460